గాంధారిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి. చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

నన్ను రెచ్చగొడితే అడ్రస్ గల్లంతే

- కాంగ్రెస్ నేతలు జాగ్రత్తగామాట్లాడాలి
- దొంగ హామీలతో గద్దెనెక్కిన ఆ పార్టీ వారికి ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్పాలి
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఫైర్

బాన్సువాడ/గాంధారి/బిచ్కుంద, ఏప్రిల్ 15: 'బాన్సువాడ పోచారం అడ్డా.. కాంగ్రెస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి.. అనవసరంగా రెచ్చగొడితే మీ అడ్రస్సులు గల్లంతవుతాయి..' అని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. దొంగ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓటుతోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారని చెప్పారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ, గాంధారి, బిచ్కుందలలో సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత సమావేశంలో పోచారం మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి మాటలు విని ప్రజలు మోసపోయి కాంగ్రెస్‌కు ఓటేశారని, ఇప్పుడు ఆ పార్టీ తీరును చూసి ప్రజలు బాధ పడుతున్నారని తెలిపారు. డిసెంబర్ 9న చేస్తామన్న రుణ మాఫీ ఏమైంది? కల్యాణలక్ష్మి చెక్కుతోపాటు ఇస్తామన్న తులం బంగారం ఎటుపోయింది? ఆడబిడ్డలందరికీ ఇస్తామన్న రూ.2500 సాయం, నిరుద్యోగ భృతి ఏమైంది? అని పోచారం ప్రశ్నించారు. ఇందులో ఏ ఒక్క హామీ అమలు చేసినట్టు నిరూపించినా రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. రూ.15 వేల రైతుబంధు అంటిరి.. వడ్లకు రూ.500 బోనస్ అంటిరి.. పింఛన్లు పెంచతామంటిరి.. వాటిని ఎప్పుడు అమలు చేస్తారు? అని నిలదీశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, జనార్దన్‌గౌడ్, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సోమవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు

ప్రజల్లో కాంగ్రెస్ బీజేపీపై అసంతృప్తి

- ఆ పార్టీల అన్యాయాన్ని ఎండగడదాం
- సమన్వయంతో ముందుకెళ్దాం
- పెద్దపల్లి, వరంగల్ పార్టీ నేతలతో కేటీఆర్
- రెండు చోట్లా విజయం మనదేనని వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్, బీజేపీపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఆ పార్టీలు రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం వరంగల్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల ఉమ్మడి నేతలతో ఆయన హైదరాబాద్‌లో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వైఖరిపై ప్రజలు కోపంతో ఉన్నారని, పదేండ్ల పాటు దేశంలోని అన్ని వర్గాలు, అన్ని రంగాలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ పాలనపై విసుగెత్తిపోయారని తెలిపారు. అన్నదాతల నుంచి ఆటోడ్రైవర్ల దాకా ప్రజలంతా కాంగ్రెస్ సర్కారుపై ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలను బీఆర్ఎస్ మాత్రమే కాపాడుతుందన్న అభిప్రాయం ప్రజలు, మేధావుల్లో ఉన్నదని వెల్లడించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జులు పూర్తి సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను సవరించుకొని క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలు కసిగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగత అభిప్రాయాల కన్నా వ్యవస్థాగత నిర్ణయమే ముఖ్యమని, ఉమ్మడిగా పనిచేస్తే ఎన్నికల్లో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంటామని చెప్పారు. వరంగల్ అభ్యర్థి మారేపల్లి సుధీర్‌కుమార్ అభ్యర్థిత్వంపై ప్రజల్లో మంచి స్పందన వస్తున్నదని అన్నారు. పెద్దపల్లిలోనూ గులాబీ గెలుపు ఖాయమైందని కేటీఆర్ అన్నారు. ఉద్యమ ప్రస్థానంతో పాటు రాజకీయ జీవితంలో మచ్చలేని నేతగా కొప్పుల ఈశ్వర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నదని గుర్తుచేశారు. కొప్పుల లాంటి ఉద్యమ గొంతుకను ఎన్నుకుంటేనే పార్లమెంట్‌లో తెలంగాణ వాణిని బలంగా వినిపించగలమని తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు సమష్టిగా పనిచేస్తామని, నాయకత్వం అప్పగించిన బాధ్యతను నెరవేరుస్తామని నేతలంతా వాగ్దానం చేశారు. సమావేశాల్లో శాసనమండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య, మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్‌లు దాస్యం వినయభాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, హనుమకొండ జడ్పీ చైర్మన్, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

లోకం పోకడ



బ్యాలెట్ బాక్సుల్లో మనకే ఓట్లేయాలి అనడిగితే పోస్టు బాక్సుల్లో ఉత్తరాలు వేస్తున్నారు సార్!

రంజిత్‌రెడ్డి కబ్జా 3 వేల ఎకరాలు

- అసైన్డ్ భూములు ఆక్రమించిన ఎంపీ
- తప్పుడు పత్రాలతో బ్యాంకు రుణాలు
- కాందిశీకుల భూముల్లో అపార్ట్‌మెంట్లు
- కోళ్ల దాణాలో సైతం కోట్ల కుంభకోణం
- కాంగ్రెస్‌నూ మోసం చేసి బీజేపీలోకెళ్తాడు
- రేవంత్‌రెడ్డితో రంజిత్‌రెడ్డి ఒప్పందం
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆరోపణ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా పరిధిలో మూడు వేల ఎకరాలను కబ్జా చేశారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఏ జీవన్‌రెడ్డి ఆరోపించారు. అసైన్మెంట్ భూములను తన భూములుగా చూపించి తప్పుడు పత్రాలతో బ్యాంకుల నుంచి కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నారని అన్నారు. పుప్పాలగూడలో ప్రభుత్వ, కాందిశీకుల భూముల్లో భారీ ఎత్తున అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తున్నారని తెలిపారు. కోళ్ల దాణాలోనూ కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని చెప్పారు. బీఆర్ఎస్‌ను మోసం చేసిన రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని కూడా మోసం చేసి బీజేపీలోకి వెళ్తాడని అన్నారు. మోసగాళ్లకే మోసగాడు చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అంటూ విరుచుకుపడ్డారు. రంజిత్‌రెడ్డి ఎంపీగా ఈసారి మళ్లీ గెలిస్తే చేవెళ్లను అమ్మేస్తాడని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం ధర్మాజిపేట గ్రామంలో 591/అ/1 సర్వే నంబర్‌లో 9.27 ఎకరాలు, 591/ఆ సర్వే నంబర్‌లో 4.22 ఎకరాల అసైన్డ్ భూములను చూపించి రంజిత్‌రెడ్డి బ్యాంకు రుణాలు తీసుకున్నారని తెలిపారు. కోళ్ల దాణా సప్లయ్ పేరుతో కోళ్ల ఫారాలనే మింగేసిన ఘనుడు రంజిత్‌రెడ్డి అన్నారు. సినీ నిర్మాత బండ్ల గణేశ్ భూమిని కూడా రంజిత్‌రెడ్డే గుంజుకున్నాడని చెప్పారు. బ్యాంక్‌లను మోసం చేసే రంజిత్‌రెడ్డి చేవెళ్ల ప్రజలకు ఏం మేలు చేస్తాడో అర్థం కావడం లేదని అన్నారు. పుప్పాలగూడ సర్వే నంబర్ 341లో 1.40 కోట్ల చదరపు అడుగుల మేర ప్రభుత్వ, కాందిశీకుల భూమిలో వెస్టర్న్ కన్‌స్ట్రక్షన్ సంస్థ నిర్మాణాలు జరుపుతున్నదని, దీనిపై స్థానిక తహసీల్దార్, ఆర్డీవోలు నోటీసులు కూడా జారీ చేశారని తెలిపారు. ఈ సంస్థ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఏపీ జితేందర్‌రెడ్డి వియ్యంకుడదని చెప్పారు. ఈ సంస్థలో రంజిత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డికి వాటాలు ఉన్నాయని చెప్పారు. ఇలా అనేక అక్రమాల పుట్టగా ఉన్న రంజిత్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేయడంతో కాంగ్రెస్‌లో చేరారని ఆరోపించారు. అవినీతి అనకొండలకు కాంగ్రెస్ అండగా నిలుస్తున్నదని విమర్శించారు. ఐదు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఎన్నికల ఖర్చు భరించేందుకు రంజిత్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితో చీకటి ఒప్పందం కుదుర్చుకున్నారి ఆరోపించారు. మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి కూడా భూ కబ్జాలు చెయ్యడంలో దిట్ట అని ఆరోపించారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

రంజిత్‌రెడ్డి నాన్‌లోకల్

పంచ భూతాలను కూడా వదలని వ్యక్తి రంజిత్‌రెడ్డి అని, ఆయన అవినీతికి పాల్పడని రంగం లేదని జీవన్‌రెడ్డి దుయ్యబట్టారు. కరీంనగర్‌లో పుట్టిన రంజిత్‌రెడ్డి, వరంగల్‌లో పెరిగారని, చేవెళ్ల వ్యక్తే కాదని చెప్పారు. పక్కా నాన్‌లోకల్ అని, వలస వచ్చి ఇక్కడ బిజినెస్ పెట్టుకున్నాడని, చేవెళ్ల ప్రజలు ఆయనకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రంజిత్‌రెడ్డి ఏ ముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతాడు అని మండిపడ్డారు. దొంగే దొంగ అన్నట్టుగా, దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా కాంగ్రెస్‌లోకి వెళ్లిన అవినీతిపరులు సత్య హరిశ్చంద్రుల లాగా పోజులు కొడుతున్నారని విమర్శించారు.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	42.6°c	24.7°c
ఖమ్మం	42.0°c	25.0°c
మెదక్	41.4°c	22.8°c
నల్లగొండ	41.0°c	24.2°c
రంగారెడ్డి	40.7°c	19.7°c
మహబూబ్‌నగర్	39.5°c	26.4°c
హైదరాబాద్	39.1°c	26.5°c
కరీంనగర్	39.0°c	27.0°c
నిజామాబాద్	38.3°c	26.4°c
వరంగల్	38.0°c	25.0°c

వచ్చే పది రోజులు వర్షాలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వచ్చే పది రోజులపాటు ఎండల తీవ్రత తగ్గి.. పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 25 వరకు తీవ్రమైన ఎండలు, వడగాడ్పులు ఉండవని, సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. ఈ నెల 18 నుంచి 25 వరకు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు అంచనా వేసింది. తర్వాత ఎండల తీవ్రత పెరిగే సూచనలు ఉన్నట్టు వెల్లడించింది. ఇటీవలి వర్షాల కారణంగా మూడు రోజులుగా కాస్త ఉష్ణోగ్రతలు తగ్గాయి. రాజస్థాన్ మీదుగా నైరుతి రుతుపవనాలు తుఫానుగా మారి కోస్తా కర్ణాటక వరకు వ్యాపించాయని తెలిపింది. మరో ఐదురోజుల పాటు హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నది.

భువనగిరిలో బీఆర్ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఆ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

రైతుల రక్తంతో ఢిల్లీకి కప్పం

- రాష్ట్రం నుంచి ఢిల్లీకి డబ్బు మూటలు
- బీజేపీ, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం
- బీఆర్ఎస్ సమావేశంలో జగదీశ్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతాంగం రక్తంతో ఢిల్లీలో కప్పం కడుతూ కాంగ్రెస్ మంత్రులు తమ పదవులను కాపాడుకుంటున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం చేసుకున్నాయని, ఆ రెండు పార్టీలు ఒక్కటేనని, కమలానికి ఓటేస్తే హస్తానికి వేసినట్టేనని తెలిపారు. 2019 ఎన్నికల్లో మాదిరి బీజేపీ బలమైన అభ్యర్థులున్న చోట కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను బరిలోకి దింపి సహకరిస్తున్నదని ఆరోపించారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై కేసీఆర్, కేజ్రీవాల్‌ను రాజకీయాల్లో లేకుండా కుట్ర చేస్తున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతుంటే ఒక్క మంత్రి కూడా మాట్లాడటం లేదని మండిపడ్డారు. వంద రోజుల్లో రెండు వందలమందికిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని పదేండ్లు వెనక్కి తీసుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలను జాతీయ పార్టీలు చేర్చుకొని టికెట్ ఇస్తున్నాయని, కాంగ్రెస్, బీజేపీకి సిగ్గుండాలని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తన సీఎం కుర్చీకి ఎసరు వస్తుందని, ముందస్తుగా తన వర్గం నేతలను చేర్చుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, చెరుకు సుధాకర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో నేడు కేసీఆర్ సభ

లక్షల మందితో సుల్తాన్‌పూర్‌లో బహిరంగ సభ • గులాబీదండులో కదనోత్సాహం

సంగారెడ్డి, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ఉమ్మడి మెదక్ జిల్లాలో మంగళవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. సుల్తాన్‌పూర్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు లక్షమందికిపైగా ప్రజలు హాజరవుతారన్న అంచనాతో బీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. మెదక్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని ఆరు అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి జనసమీకరణపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. సభ నిర్వహించనున్న స్థలాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్‌తో కలిసి పరిశీలించారు. సభ ఏర్పాట్లపై వారికి పలు సూచనలు చేశారు. అనంతరం చింతా ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ.. బహిరంగసభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు వస్తున్న కేసీఆర్‌కు ఘన స్వాగతం పలుకుతామని చెప్పారు. సభలో హరీశ్‌రావుతోపాటు మెదక్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్, పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు పాల్గొననున్నారు.

ప్రజా ఆశీర్వాద సభకు భారీగా జనసమీకరణ

సుల్తాన్‌పూర్‌లో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కేసీఆర్ ప్రసంగించనున్న నేపథ్యంలో భారీ వేదికను తీర్చిదిద్దారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు కేసీఆర్ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ ప్రారంభం కానున్నది. కేసీఆర్ హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో పటాన్‌చెరు, సంగారెడ్డి మీదుగా సుల్తాన్‌పూర్ చేరుకుంటారు. కేసీఆర్‌కు స్వాగతం పలుకుతూ ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి, గులాబీ జెండాలతో అలంకరించారు. బహిరంగసభ ప్రాంతంలో కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు, మెదక్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థులు వెంకట్రామిరెడ్డి, గాలి అనిల్‌కుమార్ కటౌట్లను సైతం ఏర్పాటుచేశారు. మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్, జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.

నివేదితను భారీ మెజార్టీతో గెలిపించాలి

- మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కంటోన్మెంట్, ఏప్రిల్ 15: కంటోన్మెంట్‌కు సాయన్న చేసిన సేవలకు గుర్తుగా ఆయన కుమార్తె నివేదితను భారీ మెజార్టీతో గెలిపించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నివేదితకు కాంగ్రెస్, బీజేపీ నాయకులు కూడా మద్దతు పలకాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం బోయిన్‌పల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. 30 ఏండ్లు ప్రజాజీవితంలో ఉన్నా సాయన్న కుటుంబానికి సొంత ఇల్లు లేదని గుర్తుచేశారు. ప్రజలతో మంచి అనుబంధం ఉన్న సాయన్న కుమార్తె నివేదితను అందరూ ఆశీర్వదించాలని కోరారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు నల్లేరు మీద నడకేనని బీఆర్ఎస్ పార్టీ కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. సాయన్న కుటుంబంపై నమ్మకంతో తనను అభ్యర్థిగా ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవితకు కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ధన్యవాదాలు తెలిపారు. తన జీవితం కంటోన్మెంట్‌కే అంకితమని, ప్రజలు తనను దీవించాలని నివేదిత విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, పాండు యాదవ్, లోకనాథ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, సీనియర్ నేతలు ఆకుల హరి తదితరులు పాల్గొన్నారు.

మీడియా సమావేశంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి తదితరులు

ఎన్నికల తర్వాత ప్రభుత్వ మార్పు

- కాంగ్రెస్ సర్కారు మరోలా ఏర్పడుతుంది
- రాష్ట్రంలో హస్తం పార్టీ గ్రాఫ్ పడిపోయింది
- స్థానిక సంస్థల ఎన్నికల్లో గల్లంతు ఖాయం
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల. చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి

భీమ్‌గల్, ఏప్రిల్ 15: లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో మార్పు వస్తుందని, మరో రూపంలో కొత్త సర్కారు ఏర్పడుతుందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో సోమవారం నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డితో కలిసి వేముల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. దొంగ హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు ఉన్నప్పుడే హామీలను అమలుచేయని కాంగ్రెస్.. ఎన్నికలు అయిపోయాక పట్టించుకుంటుందా? అని ప్రశ్నించారు. నష్టాలను భరించడం వల్ల కాదని ఆర్టీసీ చేతులెత్తేసిందని, ఎన్నికల తర్వాత మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేస్తారని అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ సీఎంగా దిగిపోయే నాటికి రూ.7,500 కోట్లు రాష్ట్ర ఖజానాలో ఉన్నాయని, ఆ డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయని కాంగ్రెస్‌ను, అహంకారి అయిన బీజేపీ ఎంపీ అర్వింద్‌ను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హామీలను వీడియోల రూపంలో పంపిస్తామని, వాటిపై గ్రామాల్లో చర్చ పెట్టి అధికార పార్టీ తీరును ఎండగట్టాలని సూచించారు. గత ఎన్నికల్లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలిసి తమ పార్టీ అభ్యర్థి మధుయాష్కిని ఓడించి, బీజేపీ అభ్యర్థి అర్వింద్‌ను గెలిపించారని బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు.

సర్కారు బడికి తాళం!

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15: బిల్లులు చెల్లించడం లేదంటూ ఓ కాంట్రాక్టర్ ప్రభుత్వ పాఠశాల గేటుకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు గంటపాటు గేటు బయట వేచి ఉండాల్సి వచ్చింది. ఈ ఘటన సోమవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లోని పెట్రోల్‌బంకు సమీపంలో గల జడ్పీ సెకండరీ పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో జరిగింది. గత ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు-మనబడి'లో రూ.1.28 కోట్లతో నూతన భవనాలు నిర్మించారు. సదరు కాంట్రాక్టర్ పనులన్నీ పూర్తిచేశాడు. రూ.97 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో పాఠశాల గేటుకు తాళం వేశాడు.

దానం నాగేందర్‌కు హైకోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి...

నిరాకరించింది. నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని గత మార్చి 14న ఇచ్చిన ఫిర్యాదుపై స్పీకర్ చర్య తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. ప్రతివాదులు కౌంటర్ దాఖలు చేయాలని, విచారణను ఈ నెల 25కు వాయిదా వేశారు. తొలుత పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. దానం నాగేందర్‌పై వేటు వేసేలా స్పీకర్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని చెప్పారు. కనీసం తమ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకొని దానంకు నోటీసులు కూడా జారీ చేయలేదని అన్నారు. ఫిర్యాదు చేయడం కోసం స్పీకర్‌ను కలిసేందుకు